# బలహీనుడు

రచన:
శ్రీ దేవులపల్లి గోపాలకృష్ణారావు

"మాష్టారూ, ! మాష్టారూ మిమ్మల్నే"

కుడిచేతిలోని కూరల సంచీ ఎడమ చేతిలోకి సర్దుకుంటూ వెనక్కి తిరిగి, కళ్ళద్దాలపైనుంచి చూశాడు సీతాపతి.

"బాగున్నారా మాష్టారూ" నవ్వుతూ పలకరించాడు ఓ పాతికేళ్ల యువకుడు, విస్తాదులా ఉన్న ఆ యువకుడివైపు కనుబొమ్మలు చిట్లించి పరీక్షిగా చూశాడు సీతాపతి. 'ఎవరితనూ .. తనకేమో జ్ఞాపకం రావటంలేదామె, బహుశా తననికాదేమో' అనుకున్నాడు సీతాపతి.

"ఏం మాష్టారూ, నన్నింకా గుర్తించలేదాండీ? నేనండీ బాబూ రావును, సికింద్రాబాదులో మీ ఇంటి కెదురుగుండా ఉండే వాళ్లం" అన్నాడు ఆ యువకుడు.

"ఆఁ, అవునవును, ఏదీ, గోపాలకృష్ణయ్యగారి అబ్బాయివి కదటోయ్, చాలా మారిపోయావ్ సుమా ! ఆఁ ఇంతకీ అంతా కులాసాయేనా? ఏం చేస్తున్నావ్ ! విజయవాడొచ్చి ఎన్నాళ్ళయిందోయ్ ఓసారన్నా కనిపించావు కావు" గుక్క తిప్పుకోకుండా అడిగాడు సీతాపతి.

"మీదయవల్ల అంతా కులాసాయేనండీ. మొన్ననే బ్యాంక్ లో పనయిందండీ" అన్నాడు ఆ యువకుడు వినయంగా.

"ఏంటీ ? బ్యాంకులోనా ఉద్యోగం, మరయితే బసెక్కడోయ్ ?"

"అక్కయ్య దగ్గరుంటున్నానండీ, ఇదే ఎదురిల్లు" ఓ చిన్న డాబా యింటివేపు చేయెత్తి చూపించాడు బాబూరావు. అక్కయ్య అనే పదం బాబూరావు నోటంట వెలువడటంతో సీతాపతి మెదళ్లో విద్యావతి రూపం మెదిలింది "అవును, విద్యావతి శలాకలా సన్నగా తెల్లగా, అందంగా ఉండేది. అవన్నీ తను కాలేజీలో చదువుకున్నప్పటి రోజులనాటి విషయాలు. విద్యావతి ఇప్పుడెలా ఉందో !" ఆలోచిస్తూ ఆ ఇంటివేపు దృష్టి సారించాడు సీతాపతి. ఇంటి గుమ్మంలో తెల్లగా బొద్దుగాఉన్న ఒకావిడ రెండు మూడేళ్ల పిల్లాడ్ని ఎత్తుకొని నిలుచోనుంది. "అవును, విద్యావతే ! ఎంత మారిపోయింది, బాగా ఒళ్లుచేసిందే" అనుకున్నాడు సీతాపతి. విద్యావతికూడా, సీతాపతిని గుర్తించి ఉంటుంది, చిరునవ్వు నవ్వింది. ఆమె అలా నవ్వడంతో, సీతాపతి ఎందుకో సిగ్గుపడిపోయి తల దించుకొన్నాడు అతని హృదయం ఆనందంతో స్పందించింది.

"రండి మాష్టారూ ! కాఫీ పుచ్చుకొని వెళుదురుగాని" ఆహ్వానించాడు బాబూరావు. "ఎందుకు బాబూ, సీతా శ్రమ ఎలాగూ ఇంటికేగా వెళ్తాంట మరెప్పుడయినా వస్తాలె. వస్తా నాయనా !" ఆనందంలో ఉక్కిరి బిక్కిరవుతూ వచ్చేశాడు సీతాపతి వీది మలుపుదాకా వెళ్ళి వెనుదిరిగి చూశాడు సీతాపతి బాబూరావు గుమ్మంలో నిలబడి విద్యావతితో ఏమో చెబుతున్నాడు. ఆమె, తనవైపే జాలిగా చూస్తోంది. ఎన్ని సంవత్సరాల తర్వాత, తను విద్యావతిని చూడగలిగాడు. ఎందుకో ఆమెను, మరీ మరీ చూడాలనిపిస్తోంది. అందుకు అవకాశం కూడా లభించింది. బాబూరావు తనకు తానై ఆహ్వానించాడు కాఫీకి రమ్మంటూ విద్యావతి తనవేపు జాలిగా చూస్తోంది. అంటే తనని చూడాలని, విద్యకూ మనసులో కోరికగా ఉందన్న మాట. ఇంత మంచి అవకాశం లభించినా తను విద్యావతికి సన్నిహితంగా వెళ్లలేకపోయాడు. అదే తనలోని బలహీనత ; అవకాశాలు లభించినా, వినియోగించుకోలేడు ఏమిటీ వెర్రి ఆలోచనలు ? తనలో తాను నవ్వుకున్నాడు సీతాపతి. ఇలాంటి అవకాశమే గతంలో ఒకసారి లభించింది సీతాపతికి, అప్పుడూ ఇంతే ? గతం జ్ఞప్తికి రావటంతో, సీతాపతి హాయిగా నవ్వుకున్నాడు.

ఆ రోజుల్లో, సికింద్రాబాదులో మేనమామ గారింట్లో ఉండేవాడు సీతాపతి. విద్యావతి వాళ్లు ఎదురింటో ఉండేవారు. విద్యావతీ వాళ్ల నాన్నగారు యస్. ఐ. సి. లో పని చేస్తుండేవారు ఆయనికి విద్యావతీ, బాబూరావు ఇద్దరే సంతానం. విద్యావతి అప్పట్లో మెట్రిక్యులేషన్ చదువుతుండేది. వాలు జడేసుకుని, వయ్యారంగా నడిచేది, తలొంచుకొని పక్కచూపులు చూస్తూ. వాలు జడా, వయారీ అని ఉడికిరించేవారు, ఆ వీధిలోని హీరోల బృందం. బాబూరావుకు తొమ్మిది పది సంవత్సరాలుండేవి. బడెగ్గొట్టి ఏ చెట్లకిందో, స్నేహితులతోనో ఆడుకుంటూ ఉండేవాడు చాలా పెంకితనం చేస్తూండేవాడు. వీడి పెంకితనం, తలిదండ్రులకు కాక సమస్యగా పరిణమించింది

ఒకరోజున సీతాపతి కాలేజినుంచి వచ్చే సరికి ఆరుగంటలకు పైగా అయిపోయింది. జోరుగా పాతసయికిల్ పెడలువేస్తూ, నీరసంగా ఇల్లు చేరుకుంటాడు సీతాపతి. విద్యావతి, ఆమె తలిదండ్రులు, వీధిలో నిలబడి ఎందుకో కంగారుగా చూస్తున్నారు. విద్యావతి తల్లి, సీతాపతిని చూసి కేక వేసింది ఆవిడతో అంతగా పరిచయం లేదు సీతాపతికి, ఏదో ముఖపరిచయం తప్ప సంకోచిస్తూ, ఆవిడ్ని సమీపించాడు సీతాపతి. "ఏమండీ పిలిచారా" మెల్లిగా అన్నాడు సీతాపతి, "అవును, బాబూ ! మా బాబూరావుగాడు పొద్దున్నగా స్కూలుకెళ్ళి ఇంతదాకా రాలేదు నాయనా ! స్కూల్లో వాకబు చేస్తే స్కూలుకే రాలేదనీ, ఎవరో బడిపిల్లలతో కలిసి రైలు స్టేషన్ వేపు వెళ్ళాడనీ తెలిసింది. నాకేమో బెంగగా ఉంది" ఆవిడగొంతు దుఃఖంతో పూడుకుపోయింది. సహజంగా ఈ స్కూలు పిల్లలు, లోకల్ రైళ్లలో దొంగతనంగా ప్రయాణం చేస్తుంటారు. అది వాళ్లకి, అదో వినయయిన సరదా. బహుశా, ఈ బాబూరావుగాడుకూడా ఇలాగే వెళ్ళి ఉంటాడాని సీతాపతి ఊహించాడు. గోపాలకృష్ణయ్యగారు దీనంగా ప్రాధేయ పడు

తున్నట్టు చూశారు సీతాపతివైపు ఆయన కళ్ళనిండుగా నీళ్లు నిలిచిఉన్నాయి మొదలే 'ఆస్తమా' పేషంటు, అందులో ఈపుత్రుడి నిర్వాకాలు ఆయన్ని మరీ కృంగదీశాయి. విద్య తండ్రికి ఆసరాగా నిలుచోనుంది "మరేం భయంలేదండీ నేవెళ్ళి వెతుకుతాగా!" అని పెద్ద డిటెక్టివ్‌లా హామీ ఇచ్చేసి విద్యావతివైపు చూశాడు సీతాపతి ఆమె కళ్లు కృతజ్ఞతలో మెరుస్తున్నాయి

ఏమిటేమిటో ఆలోచిస్తూ విమానంలా పరిగెత్తించాడు తన పాత సయికిల్ని సీతాపతి. మధ్యాహ్నమనగా తిన్న టిఫిన్ ఎప్పుడో అరిగిపోయింది బాగా ఆకలేస్తోంది. అందులోనూ, తను విపరీతంగా అలిసిపోయి ఉన్నాడు. అయినప్పటికీ తన పనిలో కృతకృత్యుడవ్వాలి. బాబూరావుని ఎలా అయినా వెతికి, దొరికించుకోవాలి అప్పుడు వాళ్లెంతో సంతోషిస్తారు. అభినందిస్తారు. ముఖ్యంగా విద్యావతి. .... ఛఛ! ఏమిటీ వెర్రి ఆలోచన తను ఈ కార్యం ఎందుకు సాధించబూనుకున్నాడు. విద్యావతి దగ్గర హీరో ఇజమ్ వెలగబెడదామనా? కాదు, కాదు. ఎదుటింటి, వ్యక్తిగా, ఆ దంపతులకు సహాయ పడదామని తనీపనిచేస్తున్నాడు. తనకు తాను సమాధానంగా సర్దిచెప్పుకున్నాడు సీతాపతి

పాత సయికిల్ దడదడలాడుతూ, కిర్‌కిర్ శబ్దాలలో ఒక విధమయిన మ్యూజిక్ సృష్టిస్తూ సీతాఫల్‌మండీ స్టేషన్ చేరుకొంది. సైకిల్ లాక్‌చేసి ప్లాట్‌ఫాం మీదికి పరిగెత్తినంతపని చేశాడు సీతాపతి అప్పటికే బాగా చీకటి పడిపోయింది. దీపాలు వెలిగించేశారు. ప్లాటుఫాంమీద అంతగా దీపాలులేవు ఎవరో ముగ్గురు వ్యక్తులు, పెద్దపెద్ద బుట్టలు పెట్టుకొని, కూర్చుని చుట్టలు కాల్చుకుంటున్నారు. బఠానీలు అమ్ముకునే కుర్రాడొకడు ఏదో సినిమా పాటని విజిల్‌మీద పాడుకుంటున్నాడు. సీతాపతి వాడి దగ్గరగా వెడుతూ "ఏమోయ్ ఉదయంనుంచి ఇక్కడే ఉన్నావా" అన్నాడు పెద్ద డిటెక్టివ్‌లా పోజుపెడుతూ. "అవునుసార్. ప్రతి రైలుబెంకొచ్చి బఠానీలు అమ్ముకుంట" అన్నాడువాడు.

"పొద్దుట తొమ్మిదీ పదీ ప్రాంతాల్లో ఎవరైనా స్కూలు పిల్లలు రైలెక్కడం చూశావా?" సీతాపతి ప్రశ్నించాడు. "చానా మందెళ్ళారండి" అన్నాడువాడు. "ఇప్పుడేదయినా ట్రెయిన్ వస్తుందా?" సీతాపతి అడిగాడు. "ఇంకోగంటయినాక కాచీగూడాకెళ్లే రైలొస్తదండీ" అన్నాడు బఠానీలబ్బాయి. "టికెట్‌లేకుండా వచ్చేవాళ్లు ఎక్కణ్ణించి తప్పించుకోవచ్చు?" బఠానీలు కొంటూ, అసలయిన డిటెక్టివ్‌లా ప్రశ్నించాడు సీతాపతి. "ప్లాట్‌ఫాం ఆవతలంగ" అన్నాడు బఠానీలబ్బాయి సీతాపతి ఒకసారి గడియారంవంక చూసుకొని ప్లాటుఫాం కవతలివేపువెళ్ళి నిలబడ్డాడు. బహుశా బాబూరావు టికట్‌లేకుండానే వెళ్ళి ఉంటాడని సీతాపతి ఊహ.

దూరంనుంచి రైలుకూత వినిపించింది. ఉలిక్కిపడ్డాడు సీతాపతి. ఇప్పుడు తన డిటెక్షనులో రెండవ ఛాప్టర్ ప్రారంభమవబోతోంది అనుకున్నాడు సీతాపతి రైలు వచ్చి ఆగింది ఎలబిల్లాడుతూ చాలా మంది దిగారు. ప్లాటుఫారం మీదికన్నా ఇవతలివేపు దిగేవారి సంఖ్యే ఎక్కువ. చాలామంది దొంగదార్ల గుండా పరుగెడుతున్నారు. సీతాపతి అందర్నీ ఆ గుడ్డి వెలుగులోనే పరీక్షగా చూశాడు. రైలు వెళ్ళిపోయింది. స్టేషన్‌లో తిరిగి నిశ్శబ్దం ఆవరించుకొంది. కాని బాబూరావు కనిపించలేదు. ఉస్సురుమన్నాడు సీతాపతి. మరింకా వచ్చే రైళ్లున్నట్టుగా లేవు. మరయితే బాబూరావుగాడి జాడ ఎలా తెలుసుకోడం. వీడి సంగతి తెలుసుకోకుండా విద్యావతికి మొహమెలా చూపించడం ?.... కాదు, కాదు గోపాలకృష్ణయ్యగారితో ఏమని చెప్పడం." మనస్సు పలికిన అపశృతికీ, ఎమెండ్‌మెంటు ప్రతిపాదించుకున్నాడు సీతాపతి ప్లాటుఫాంమీద నడుస్తూ ఎవరో భుజం తట్టారు వెనకనుంచి. వెనక్కితిరిగాడు సీతాపతి అశగా. "టికట్ ప్లీజ్" ఎదురుగా టికట్ కలెక్టరు. ఎందుకో అకారణంగా, గాభరా పడిపోయాడు సీతాపతి. ముచ్చెమటలు పోశాయి. "వాట్ మిష్టర్! చదువుకున్నవాడిలా కనిపిస్తున్నావ్, నీలాటివాళ్లుకూడా టికట్ కొనకుండా ప్రయాణం చేస్తేఎట్లా? కొంచమయినా ఇంగితజ్ఞానం ఉండక్కర్లా?" ఒక నాన్‌స్టాప్ స్పీచ్ దంచేసి విసుక్కుంటూ వెళ్ళిపోయాడు టి సి. సీతాపతికి నిద్రమత్తు వదలినట్టయింది. టి. సి. ఎందుకిలా అపోహ పడ్డాడు అయినా తన సంగతి వాడికేంతెలుసు. అసలు తప్పంతా తనది మొదటే. టి. సి పర్మిషన్ తీసుకొనుంటే సరిపోయేది? మరి తను స్టేషన్‌లోకి ప్రవేశించినప్పుడు టి సి కనిపించలేదే. ఏమయినా ఇదంతా తన కర్మ. సైకిల్ అన్‌లాక్‌చేసి బయలుదేరాడు సీతాపతి. మెదడంతా గందరగోళంగా ఉంది. 'తనిప్పుడు రిక్త హస్తాలతో వెళ్ళాలి! తనేమో పెద్ద హీరోలా ఫోజెట్టి బయలుదేరాడు. కాని ఫలితం శూన్యం. తనిప్పుడేం చెయ్యాలి వాళ్లేమనుకుంటారు, ముఖ్యంగా విద్యావతేమనుకుంటుంది ..ది ది. ఎదురుగా ఎవరో పోలీసొస్తున్నాడు సైకిల్‌మీద. సీతాపతికి గుండె ఆగినంతపనయింది, తను సైకిల్ లైటు వెలిగించలేదన్న సంగతి అప్పుడుగాని జ్ఞాపకం రాలేదు సీతాపతికి పోలీసు ఏ మూడ్‌లో ఉన్నాడో ఏమో, ఏమనకుండానే వెళ్ళిపోయాడు. బ్రతుకు జీవుడా! అనుకున్నాడు సీతాపతి

"హాల్లో! సీతాపతీ!" ఎవరిదో పరిచిత కంఠమే పరధ్యాన్నంగా సైకిల్ తొక్కుతున్న సీతాపతి సడన్‌బ్రేకు వేశాడు పక్కింటి సుబ్బారావు కనిపించాడు. వాడి ప్రక్కనే బాబూరావు కూడా ఉన్నాడు. వెదకబోయినతీగ కాలికి తగిలింది. "ఏమోయ్ బాబూరావ్, ఇంట్లో చెప్పకుండా వెళ్లావట, అమ్మా నాన్న, బెంగెట్టుకుంటున్నారు పద" అన్నాడు సీతాపతి "ఎవేనోయ్ నేనూ వీడికోసమే వెతికి రైలు స్టేషన్ దగ్గర కనిపిస్తె తీసుకొస్తున్నా" అన్నాడు సుబ్బారావు "ఏమిటీ! నేనూ వచ్చానే స్టేషన్‌కి మరినా. కనిపించలేదే?" నీళ్ళు కారిపోయాడు సీతాపతి. అయితే తను ప్లాట్‌ఫాం కవతలివేపు నిలుచున్నాడు. బాబుగాడు ప్లాటుఫాం మీదే దిగాడేమో,

(తరువాయి 22 వ పేజీలో)

## బలహీనుడు

(12 వ పేజీ తరువాయి)

టిక్కెట్టుందేమో? ఏమైనా సుబ్బారావు గాడు నన్ను కొట్టేశాడు వెధవ చెసీ తన్నుకొచ్చింది హృదయంలోంచి. తనింత శ్రమపడ్డాడుఫలితం శూన్యం. సుబ్బారావుదీ లక్కీ అంతే. విద్యావతిదగ్గర గర్వంగా పోజు కొడతాడు. తనో మరి ... ఏడవలేక నవ్వాలి. సీతాపతి హృదయం బాధగా మూలిగింది.

ఇల్లు సమీపించింది. సుబ్బారావూ, బాబుగాడూ ఇంట్లోకి దూరారు. తను వెళ్ళడమా, మానడమా? తటపటాయించాడు సీతాపతి సుబ్బారావు ఘనకార్యం సాధించినట్టు పోజెడతాడు విద్యావతి వద్ద. తనకది అవమానం. తను అప్రయోజకుడిలా నిలుచోవాలా? ఛ. ఛ.... ఏమిటిది తను కాయశక్తులా ప్రయత్నించాడు. కాని బాబూరావు తనకు దొరకలేదు. ఇందులో తన అప్రయోజకత్వమేముంది. బుర్ర గోక్కున్నాడు సీతాపతి.

ఇంతలో గుమ్మందగ్గర శబ్దమయింది. చెట్టు చాటున చీకటిలో నిలుచుండి చూశాడు సీతాపతి. విద్యావతీ, సుబ్బారావూ ఇద్దరూ వెలుపలికొచ్చారు విద్యావతి కళ్ళు ఆనందంతో మెరిసిపోతున్నాయి (సీతాపతి ఊహించాడు) "థ్యాంక్సండీ" అంది విద్యావతి. అబ్బే! ఇది ఏమంత పెద్ద ఘనకార్య మనండీ" హీరోలా, గూడ ఎగరేస్తూ అన్నాడు సుబ్బారావు. ధనుర్భంగంనాటి రావణుడిలా. గిజగిజలాడాడు సీతాపతి.

ఆనాటి రాత్రంతా ఇవే ఆలోచనలు. విద్యావతీ, సుబ్బారావూ, తనూ, "ఛీ ఛీ ఇంత 'మీన్'గా ఆలోచిస్తున్నాడేమిటితను. తను చేయగలిగింది చేశాడు. గోపాలక్రిష్ణయ్యగారికి సహాయపడ్డామనుకున్నాడు. విఫలుడైనాడు. అంతేగాని విద్యావతి దగ్గర అభిమానం సంపాయిద్దామని తనీ పని ఎంత మాత్రం చేయలేదు. గట్టిగా అనుకున్నాడు సీతాపతి. "అంతేలే నాకు తెలియదూ!" అంది సీతాపతి హృదయం. గత సంఘటనలు జ్ఞాపకానికి రాగానే నవ్వొచ్చింది సీతాపతికి. ఆనాడు తను నిజంగా ఎంతో శ్రమపడ్డాడు. అదృష్టం కలిసిరాలేదు. అంచేత తనెందుకు అప్రయోజకుడినని ఫీలవడం? కాని ఏమిటో మరి ఆడదాని ముందు హృదయం అలా లొంగిపోతుంది. నిజంగా తను తెలివయినవాడయితే, తాను కూడా లోపలికెళ్ళి. బాబూరావు దొరికినందుకు హర్షం వెలిబుచ్చి. నాలుగు అనునయ వాక్యాలు చెప్పించే సరిపోయేది. కాని తను ఇంట్లోకి వెళ్ళలేదు. తనకంత చొరవాలేదు సాహసమూ లేదు. ఆదే తన బలహీనత. కాని ఒప్పుకోడానికి నామర్దా. అందుకే హీరోలంగా మనకి మనం ఊహించుకోవడమో, లేక ఇంకోళ్ళని విలన్లగా సృష్టించడమో చేస్తాం. తనక్కి ఆనాడూ చొరవలేక పోయింది. ఆఖరికీనాడు బాబూరావు తనను తానై ఆహ్వానిస్తే కూడా తాను వెళ్ళలేక పోయాడు. కాని వెళ్ళి విద్యావతితో మాటాడి ఉంటే బాగుండును అని అనిపిస్తుంది. కాని తనువెళ్ళలేడు. అంత చొరవలేదు. ఎంచేత? ఏమోమరి?.... "అదే నా బలహీనత" గొణుక్కున్నాడు తనలో తాను సీతాపతి.

విద్యావతికి సమీపంగా వెళ్ళాలి. ఆమెతో మనసారా చిన్ననాటి ముచ్చట్లు మాటాడాలి అని కోరుకున్నాడు సీతాపతి. ఆ కోరిక కోరికగానే మిగిలిపోయింది సీతాపతి హృదయంలో. విద్యావతి కనిపిస్తుందేమోనని ఆమెఇంటిదగ్గరనుంచి చాలాసార్లు నడిచాడు సీతాపతి. ఆఖరికి ఆమెను చూడగలిగితేచాలు అనుకున్నాడు సీతాపతి. కాని ఒకవేళ విద్యావతి గుమ్మంలో కనక కనిపిస్తే, ఏమనుకునేవాడోఏమో తలొంచేసుకుని గబగబా నడిచివచ్చేసేవాడు బలహీనుడు సీతాపతి

—o—

# ఉదయభారతి

శ్రీ కొడాలి దామోదరయ్యగారి అధ్యక్షతన కళాభిమానుల సమావేశమై విజయవాడ పట్టణములో ఒక నూతన ఆదర్శ ప్రాయమైన కళా సంస్థను లోగడ సమావేశములలో ఏర్పాటు చేసుకొనిన ప్రకారము ఈ దిగువ సభ్యులతో "ఉదయభారతి" అను పేర నిర్మాణము చేసియున్నారు.

అధ్యక్షులు : శ్రీ కొడాలి దామోదరయ్య,
ఎం. ఎ. ఎల్. ఎల్. బి.

ఉపాధ్యక్షుడు :
శ్రీ కవులూరి వెంకటేశ్వరరావు,
బి. ఎ. బి. ఎల్.
శ్రీ డాక్టరు కె. కె. వీరయ్య

కార్యదర్శి : శ్రీ మల్లాది క్రిష్ణయ్య,
యం. కాం. యల్. యల్. బి.

సంయుక్తకార్యదర్శి : శ్రీ యం. జయరామారావు

కోశాధికారి : శ్రీ యం. మల్లిఖార్జునరావు

కార్యవర్గసభ్యులు : శ్రీ యం. యస్. చౌదరి
,, శ్రీ టి. వై. యల్. యన్. వాట్.
ప్రసాదరావు
,, శ్రీ జె. కృష్ణమూర్తి, యఫ్. అహానా

దర్శకుడు అండ్ ప్రయోక్త :
శ్రీ కొడాలి ఆదిశేషయ్య

సంరక్షక కమిటీ : శ్రీ యం. క్రిష్ణయ్య
,, శ్రీ యం. మల్లిఖార్జునరావు
,, శ్రీ యం. వి. సత్యనారాయణరావు
,, శ్రీ కె. ఆదిశేషయ్య, దామోదరయ్య

నిర్మాణ కమిటి :
శ్రీ యం. వి. సత్యనారాయణరావు
శ్రీ యం. మల్లిఖార్జునరావు
శ్రీ కె. ఆదిశేషయ్య

ఈ సంస్థను రిజిష్టరు గావించుటకు ఏకగ్రీవముగా తీర్మానించుకొని, దానికి కావలసిన నిధిని ఏర్పాటు చేసుకొనడమైనది.

ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమువారు నాటకములపై విధించిన వినోదపు పన్ను రద్దు చేయవలసినదిగా ప్రభుత్వమువారిని కోరుచూ తీర్మానించడమైనది.